సాక్షి నిర్మల్

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



సర్కారుబడిలో.. క్రీడా కెరటాలు

సర్కారు బడిలో చదువుతున్న విద్యార్థులు. రగ్బీ, ఖోఖో, బాస్కెట్‌బాల్ క్రీడాల్లో సత్తా చాటుతున్నారు. ఆయా క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 8లో▸



శనగ రైతులకు కష్టాలు

ఆరుగాలం కష్టించి పని చేసే రైతులను కష్టాలు వదలడం లేదు. కుభీర్ మండలంలో వంద ఎకరాల్లో శనగ విత్తనాలను పురుగు తినేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.5 / 16.3

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతాయి. మంచు కురుస్తుంది. చలి పెరుగుతుంది.

యూడైస్ ప్లస్.. @ 62 %



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు(ఫైల్)



యూడైస్ ప్లస్ నమోదు పోర్టల్ ఇదే

- వసతుల కల్పనకు ఇదే ప్రామాణికం
- నమోదై ఉంటేనే విద్యార్థులకు పథకాలు
- నేటితో ముగియనున్న గడువు
- గడువు పెంచాలంటున్న యాజమాన్యాలు

నిర్మల్ ఖిల్లా: ఒక విద్యార్థి యొక్క యూనిక్ ఐడీ నంబరును ఎంటర్ చేయగానే ఆ విద్యార్థి యొక్క సమగ్ర సమాచారమైన వ్యక్తిగత వివరాలు, చదువుతున్న విద్యాసంస్థ పేరు, ఆ విద్యాసంస్థలోని మౌలిక సదుపాయాలు, బోధన బోధనేతర సిబ్బంది తదితర వివరాలన్నీ ఏకీకృతంగా చూపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే శ్రీకారం చుట్టాయి. విద్యాశాఖలో అమలుచేయబోయే పథకాలు కిందిస్థాయి వరకు పకడ్బందీగా అమలు చేయడానికి యూడైస్ ప్లస్‌లో వివరాలు నమోదు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల స్థితిగతులతోపాటు విద్యార్థుల ప్రొఫైల్ వివరాలను పక్కాగా ఆన్‌లైన్ చేసేందుకు కేంద్ర విద్యావనరుల శాఖ యూడైస్ ప్లస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్‌లో పాఠశాల, బ్లాక్(మండలం), జిల్లా, రాష్ట్ర, కేంద్రస్థాయిల్లో ప్రతీ విద్యార్థి వ్యక్తిగత వివరాలు, చదువుతున్న విద్యాసంస్థ తదితర సమగ్ర సమాచారాన్ని నెల రోజులుగా నిక్షిప్తం చేస్తున్నారు. గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా జిల్లాల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగానే రాబోయే 2024–25 విద్యా సంవత్సరంలో పథకాలు, వసతుల కల్పన, ఇతర కార్యక్రమాలు అమలు చేయనున్నారు.

నేటితో ముగియనున్న గడువు..

డేటా నమోదుకు ఈ నెల 12వ తేదీ గడువుగా పేర్కొన్నారు. అయితే ఒక్కొక్క విద్యార్థి యొక్క సమగ్ర సమాచారాన్ని నమోదు చేయడంలో సుదీర్ఘంగా సమయం వెచ్చించాల్సి ఉండడంతో గడువు తేదీని పొడిగించాలని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 62 శాతం విద్యార్థుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేశారు. చాలా పాఠశాలలు డేటా ఎంట్రీలో వెనుకపడ్డాయి.

ఎఫ్ఆర్ఎస్ కూడా అనుసంధానం...

ముఖ గుర్తింపు వ్యవస్థ (ఫేస్ రికగ్నిషన్ సిస్టం)తో ప్రతీ విద్యార్థి పాఠశాలకు రాగానే ప్రత్యేక యాప్ ద్వారా అతని ముఖాన్ని స్కాన్ చేయడం ద్వారా పాఠశాల హాజరును నమోదు చేసే ఎఫ్ఆర్ఎస్ ముఖ గుర్తింపు వ్యవస్థను సైతం అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే ఆయా ప్రభుత్వ పాఠశాలలలో ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియ ప్రారంభం కాగా దీన్ని సైతం యూడైస్ ప్లస్ పోర్టల్‌కు అనుసంధానం చేశారు. దీంతో ప్రతీరోజు హాజరు శాతం వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా ఏర్పాటు చేశారు.

నమోదు తప్పనిసరి...

రాష్ట్ర విద్యాశాఖ పలు కార్యక్రమాల అమలుకు 'యూడైస్ ప్లస్ ' పోర్టల్ సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోనుంది. పథకాల రూపకల్పనలో అంచనాలకు, ఇతర సంస్కరణలకు, పాఠశాలల్లో సదుపాయాల కల్పన ఇదే ప్రధానాధారం. యూనిఫామ్ దుస్తులు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం పథకం, ఉచిత పాఠ్యపుస్తకాల సరఫరా, ఉపకార వేతనాల మంజూరు, రవాణా, ఇతర(ఎస్కార్ట్ తదితర) భత్యాల మంజూరుకు ఏటా నమోదు చేయనున్న సమాచారమే ప్రాతిపదిక కానుంది.

సిబ్బందికి శిక్షణ

ఈ నేపథ్యంలో వివరాలు తప్పుల్లేకుండా నమోదు చేసే విషయమై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల , జిల్లాస్థాయి విద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే పోర్టల్‌లో నమోదైఉన్న విద్యార్థుల వివరాల అప్డేట్, విద్యాభ్యాసం పూర్తయిన డేటా తొలగింపు, కొత్తగా ప్రవేశం పొందిన వారి సమాచారం నిక్షిప్తంపై పూర్తి అవగాహన కల్పించారు. నమోదు ప్రక్రియ కూడా ముమ్మరంగా కొనసాగుతోంది. నేటితో గడువు ముగియనుండటంతో విద్యాసంస్థల యాజమాన్యాలపై ఒత్తిడి పెరుగుతోంది.

పలు ప్రయోజనాలు..

ప్రతీ విద్యార్థికి 'పెన్'(పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్) అనే ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తారు. ఆ నంబరును విద్యార్థికి అందజేసే బదిలీ ధ్రువపత్రం, మార్కుల పత్రం(మెమో), విద్యార్హత ధ్రువపత్రం, హాజరు నమోదు రికార్డు, ప్రవేశ పత్రం, ఇతర అన్ని రకాల రిజిస్టర్లలో నమోదై ఉంటుంది. ఆ పాఠశాల వసతులు, ఇతర సమగ్ర సమాచారాన్ని సైతం వెబ్‌సైట్‌లో నిర్దిష్ట ప్రొఫార్మాలో పొందుపరుస్తారు. ఏ మార్పులు, చేర్పులున్నా సమాచారాన్ని సవరించేలా విద్యాశాఖ మార్గనిర్దేశనం చేస్తుంది.

నమోదును పూర్తి చేయాలి...



ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న అన్నిరకాల యాజమాన్యాల విద్యాసంస్థల విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. ఇప్పటికే నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. విద్యాసంస్థల్లో అన్నిరకాల వసతుల సమగ్ర వివరాలూ సకాలంలో నమో దు చేయాలి. ఈ సమాచారం ఆధారంగానే రానున్న రోజుల్లో విద్యార్థులకు అన్నిరకాల సదుపాయాలు, వసతులు సమకూరుతాయి.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

యాసంగికి పెట్టుబడి సాయం..!

- పాతపద్ధతిలోనే చెల్లింపు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.7,500 చొప్పున రెండు సీజన్లకు ఏడాదికి రూ.15 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సీఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ యాసంగికి పాత పద్ధతిలో పెట్టుబడి సాయం అందించాలని సోమవారం ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం అందుబా టులో ఉన్న డబ్బులు ఇవ్వాలన్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతోంది. అనేక ప్రాంతాల్లో రైతులు వరినార్లు పోసుకోవడం, నాటు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వానాకాలం ధాన్యం డబ్బులు కూడా రై తుల ఖాతాల్లో పడలేదు. దీంతో పెట్టుబడికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు త్వరలో రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ కానున్నాయి.

1,96,471 మంది రైతులకు..

జిల్లా వ్యాప్తంగా 1,96,471 మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. ప్రస్తుతం వి త్తనాలు కొనుగోలు, దున్నడానికి ట్రాక్టర్ కిరా యి, ఎరువుల కొనుగోలు, నాట్లువేసే కూలీల కు చెల్లించేందుకు చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణికి 12 దరఖాస్తులు

- స్పందన అంతంతే..
- మండలాల వారీగా నిర్వహిస్తామన్న కలెక్టర్
- సద్వినియోగం చేసుకోవాలన్న సూచన



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: దాదాపు రెండు నెలల తర్వాత జిల్లాలో ప్రజావాణి పునఃప్రారంభమైంది. అసెంబ్లీ ఎన్నికల కారణంగా ప్రజావాణిని అధికారులు నిలిపివేశారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలు ఓపికగా విన్నారు. భూసమస్యలు, డబుల్ బెడ్ రూమ్, పెన్షన్ల గురించి 12 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం మండలాల వారీగా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో వచ్చిన దరఖాస్తులను వారంరోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ధరణి పోర్టల్ తొలగించాలి



మాది లక్ష్మణచాంద మండలం బంజర గ్రామం. మా గ్రామంలోని వ్యవసాయ భూములు ధరణి పోర్టల్‌లో కనిపించడం లేదు. సమస్య పరిష్కరించాలని మూడేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాం. కొత్త ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రద్దు చేసేలా చూడాలి.

– లక్ష్మారెడ్డి, కంజర

డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలి..



చైన్‌గేట్ నుంచి బంగల్‌పేట్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మా ఇల్లు కోల్పోయాం. మున్సిపల్ అధికారులు డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మాకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలి.

– సత్యం, బంగల్‌పేట్, నిర్మల్

మా భూమి మాకు ఇప్పించండి



సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలోని 542/42 సర్వే నంబర్‌లో ఉన్న తన పట్టా భూమిలో కూచన్‌పల్లికి చెందిన కొందరు అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారు. ఈవిషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. మా భూమిని మాకు ఇప్పించండి.

– పెద్ద గంగాధర్, న్యూవెల్మల్

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని, ఓటరు జాబితాలో నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పనపై కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదుకు 2024, జనవరి 1ని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ 2024కు ముందు పోలింగ్ కేంద్రంలో 1,450 కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ చేయాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు జాబితాలో మరణించిన ఓటర్ల పేర్లు తొలగింపు, ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలవారీగా జాబితా, అడ్రస్‌ను, పోలింగ్ కేంద్రాల జీఐఎస్ ద్వారా క్యాప్చరింగ్, ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జాబితా చేపట్టిన సమాచారాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, జనవరి 22 వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. ఫిబ్రవరి 2లోగా ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, ఫిబ్రవరి 8న తుది జాబితా రూపొందించాలని సూచించారు. నూతనంగా ఓటు హక్కు పొందుతున్న వారి జాబితా ప్రత్యేకంగా రూపొందించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఖానాపూర్ ఆర్డీవో జీవాకార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇథనాల్ కర్మాగారం నిలిపివేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న యువకులు

దిలావర్‌పూర్: మండల కేంద్రమైన దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ కర్మాగారాన్ని వెంటనే నిలిపివేయాలని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కొంత కాలంగా ఆగిన పనులు ఎన్నికలు ముగిశాక శరవేగంగా కొనసాగుతున్నాయంటూ పలువురు యువకులు కర్మాగారా ప్రదేశానికి సోమవారం చేరుకుని అక్కడి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని నిర్మాణ సంస్థ పేర్కొనడంతో వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తమ గ్రామ పరిసరాల్లో కర్మాగారం నెలకొల్పితే తీవ్ర అనర్థాలు వస్తాయని, దీనిని వెంటనే నిలిపివేయాలంటూ తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఇందులో నాయకులు కట్కం రాజారెడ్డి, పాల్దె శ్రీనివాస్, కుంట గంగారెడ్డి, పాల్గొన్నారు.

జువాలజీ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సారంగపూర్: మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో ఇంటర్ విద్యార్థులకు జువాలజీ బోధించడానికి అర్హులైన మహిళా అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమాకళ్యాణి తెలిపారు. అభ్యర్థులు ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈనెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తరలిన క్రీడాకారులు



రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు సోమవారం బయలుదేరి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రీడాకారులకు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి రమణారావు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈనెల 13 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు రాణించాలని ఆకాంక్షించారు. పీఈటీలు భూమన్న, రామారావు, జమున, సంజు, సురేష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో చాన్స్

- ఓటరు జాబితా సవరణకు సీఈసీ షెడ్యూల్
- 2024 జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండే వారికి ఓటుహక్కు
- మార్పులు, చేర్పులకూ అవకాశం

భైంసాటౌన్: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొత్త ఓటర్ల నమోదుతోపాటు, మార్పులు, చేర్పులకు అవకాశమిచ్చిన ఎన్నికల సంఘం తాజాగా త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మరోమారు ఓటరు జాబితా సవరణకు ఆదేశించింది. ఈ మేరకు షెడ్యూల్ కూడా విడుదల చేసింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రకారం ఫిబ్రవరి 8న తుది జాబితా వెలువరించనున్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించడంతోపాటు మార్పులు, చేర్పులు సైతం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, బోగస్ ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులు చేయనున్నారు.

18 ఏళ్లు నిండిన వారికి..

2024, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు కొత్తగా ఓటు నమోదుకు అర్హులని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి 26,885 మంది యువత ఓటుహక్కు నమోదు చేసుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేలా ఓటరు నమోదు చేపట్టనున్నారు. ఈ మేరకు అర్హులైన యువత సమీప బీఎల్వోలకు లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 2024, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత వివరాలు సేకరించడానికి అధికారులు మరోసారి ఇంటింటికీ తిరగనున్నారు. ఫారం-6లో దరఖాస్తు చేసుకుంటే బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో విచారణ జరపనున్నారు. అలాగే అవసరం మేరకు పోలింగ్ కేంద్రాల పెంపు చేపట్టనున్నారు.

శని,ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు..

అర్హులైన యువత ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలతోపాటు యువత కళాశాలల్లోనే దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించనున్నారు. ఇందుకుగాను షెడ్యూల్ వ్యవధిలో ఏదో ఒక శని, ఆదివారాల్లో ఈ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. కొత్తవారి నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్-2024)షెడ్యూల్ ఇలా...

జనవరి 5 వరకు : కొత్త దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పులు చేపడతారు.
జనవరి 6న : ఓటరు జాబితా ముసాయిదా ప్రకటన
జనవరి 22వరకు : అభ్యంతరాల స్వీకరణ
22 నుంచి ఫిబ్రవరి 1 వరకు : ఏదో ఒక శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
ఫిబ్రవరి 2 : అభ్యంతరాల పరిశీలన
ఫిబ్రవరి 8 : తుది జాబితా ప్రకటన

సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం...

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కొంతమంది పేర్లు గల్లంతు కావడం, జాబితాలో తప్పులు దొర్లడం, కుటుంబంలోనే ఒకరికి ఓ పోలింగ్‌బూత్‌లో, మరొకరికి మరో బూత్‌లో పేరు రావడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జాబితాలో పేర్లు లేనివారు, చిరునామా తప్పుగా ఉన్నా, పోలింగ్‌బూత్ మార్చుకోవాలన్నా.. సవరణలకు అవకాశం కల్పించింది. ఈనెల 20 నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. జనవరి 5లోగా కొత్త దరఖాస్తుల పరిశీలన, మార్పులు, చేర్పుల అనంతరం 6న ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. అదేనెల 22 వరకు అభ్యంతరాల స్వీకరణ, బీఎల్వోలతో మరోసారి ఇంటింటి పరిశీలన నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2న జాబితా పరిశీలించి 8న తుది జాబితా ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాలో తప్పులు దొర్లినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం ఉంటుంది.

సగానికిపైగా ధాన్యం కొనుగోళ్లు

- 59 శాతం పూర్తి కావచ్చిన లక్ష్యం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఇలా...

లక్ష్యం : 1,36,288 మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసింది : 80,045.280 మె.టన్నులు
కొనుగోలు కేంద్రాలు : 221
విక్రయించిన రైతులు : 16,894
రైతుల ఖాతాల్లో జమైన సొమ్ము : రూ.124.57 కోట్లు

భైంసాటౌన్: జిల్లాలో ఖరీఫ్ 2023–24 సీజన్ ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. జీసీసీ, డీఆర్‌డీఏ, డీసీఎంఎస్, పీఏసీఎల్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోతలు పూర్తయిన రైతులు ధాన్యం విక్రయిస్తుండగా, ఇప్పటికే దాదాపు స గానికిపైగా కొనుగోళ్లు పూర్తయ్యాయి. కాగా, ఇటీవ ల కురిసిన వర్షాలకు పొలాల్లో నీళ్లు నిలిచి కోత యంత్రాలు నడిచే వీలు లేకుండా ఉంది. దీంతో పంట కోతకు వచ్చి నెలరోజులు కావస్తున్నా కొంత మంది రైతులు కోయలేకపోతున్నారు. హార్వెస్టర్లు అందుబాటులో లేక, కూలీల కొరత కారణంగా చాలాచోట్ల కోతకు వచ్చిన పంట చేలలోనే పాడవుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు యాసంగి నార్లు పోస్తుండగా, ఇప్పటికి కోతలు పూర్తి కాకపోవడంతో దిగులు చెందుతున్నారు. పంటకోతలు పూర్తయ్యేవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచాలని రైతులు కోరుతున్నారు.

సగానికిపైగా కొనుగోళ్లు..

జిల్లాలో ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు దాదాపు 59 శాతం పూర్తి కావొచ్చింది. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం జిల్లాలో మొత్తం 1.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ది గుబడి వస్తుందని అంచనా. 221 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇప్పటివరకు 80 వే ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈ నెలాఖరు వరకు లక్ష్యం మేరకు కొనుగోలు చేయనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. 16,894 మంది రైతులు ధాన్యం విక్రయించగా, 7693 మంది రైతుల ఖాతాల్లో నగదును జమ చేశారు.

లిఫ్ట్ లేక కష్టాలు



అసంపూర్తిగా లిఫ్ట్ పనులు



అవస్థలుపడుతూ మెట్లు దిగుతున్న దివ్యాంగ ఉద్యోగులు

నిర్మల్ సమీకృత కలెక్టరేట్‌లో లిఫ్ట్ లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలన సౌలభ్యం కోసం సమీకృత కలెక్టరేట్ నిర్మించారు. జూన్‌లో అప్పటి సీఎం కేసీఆర్ దీనిని ప్రారంభించారు. భవనం ప్రారంభించి ఏడు నెలలు గడిచినా లిఫ్ట్ మాత్రం అందుబాటులోకి తీసుకురావడం లేదు. కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగులు, వృద్ధులతోపాటు కార్యాలయంలో పనిచేసే దివ్యాంగ సిబ్బంది, కీళ్ల నొప్పులు ఉన్న అధికారులు మెట్లెక్కేందుకు ఇబ్బంది పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

భారతీయ భాషా దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్/ముధోల్: మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతి పురస్కరించుకొని నిర్మల్ పట్టణం బుధవార్‌పేట్‌లోని శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో, ముధోల్ మండల కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో భారతీయ భాషా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సుబ్రహ్మణ్య భారతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల కార్యదర్శి టీఎన్. స్వామి మాట్లాడుతూ సుబ్రహ్మణ్య భారతి తమిళ రచయిత, కవి, స్వతంత్ర్య సమరయోధుడు, మహాకవిగా సుప్రసిద్ధుడన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో దేశభక్తి, జాతీయత వంటి భావాలను వెలుగొందేలా చేశారన్నారు. ముధోల్ పాఠశాల సహ ఆచార్యులు శ్రీనివాస్ సుబ్రహ్మణ్య భారతి చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానాచార్యులు కొండూరు నరేశ్, సారథిరా, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాపూర్ బస్సు పునఃప్రారంభం



బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని గంగాపూర్ గ్రామానికి ఆ ర్టీసీ బస్సును సోమవారం పునఃప్రారంభించా రు. ఏటా వర్షాకాలంలో రోడ్డు కొట్టుకుపోవ డం నాలుగు నెలలపాటు బస్సు నడవదు. గ్రా మస్తులంతా కలిసి రోడ్డుకు మరమ్మతులు చేశా క ఆర్టీసీ అధికారులు బస్సును ప్రారంభిస్తారు. ఈ బస్సు ద్వారా గంగాపూర్, రానిగూడ, కొర్రతండా గ్రామ పంచాయతీ వాసులు రాకపోకలు సాగిస్తుంటారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సదరు యువతి రాత్రి వరకు కూడా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం యువతి తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మద్యం మత్తులో వృద్ధుడు ఆత్మహత్య

జైనథ్: మద్యం మత్తులో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గొల్ల రాములు (70), గొల్ల భాగిర్తబాయి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా రాములు మద్యానికి బానిసయ్యాడు. తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగేవాడు. సోమవారం కూడా మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగడంతో బయటకు వెళ్లిపోయింది. ఆ తర్వాత ఇంటికి వచ్చి చూడగా దూలానికి ఉరేసుకుని కనిపించాడు. భాగిర్తబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



భీమేశ్(ఫైల్)

దిలావర్‌పూర్(నిర్మల్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాడేగాం గ్రామానికి చెందిన సుంకరి భీమేశ్(35) రెండేళ్ల క్రితం అప్పులు చేసి ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. చాలీచాలని వేతనంతో కుటుంబ పోషణ భారం కావడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


మంత్రిని కలిసిన బాసర ఆలయ ఈవో



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఈవో విజయరామారావు

భైంసా: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి కొండా సురేఖను సోమవారం బాసర ఆలయ ఈవో విజయ రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాసర ఆలయానికి రావాలని ఆహ్వానించారు. త్వరలోనే బాసర ఆలయానికి వచ్చి సమీక్ష నిర్వహిస్తానని మంత్రి తెలిపినట్లు ఈవో వెల్లడించారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీ



బాసర ఆలయంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పూజలు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సోమవారం దర్శించుకున్నారు. బాసరకు వచ్చిన మాజీ ఎంపీకి బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. నా యకులతో కలిసి వెళ్లినరాథోడ్ రమేశ్ సరస్వతీ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ఆల య అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.

సర్కారుబడిలో.. క్రీడా కెరటాలు

- జోనల్ స్థాయిలో నిర్మల్ జిల్లా విద్యార్థుల ప్రతిభ
- రాష్ట్రస్థాయికి ఎంపికైన పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- రగ్బీ, ఖోఖో, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో రాణింపు

నిర్మల్ ఖిల్లా: వారంతా సర్కారు బడిలో చదువుతున్న దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు. కానీ క్రీడా ప్రాంగణంలో దిగితే మాత్రం వారంతా చిరుతలే. లక్ష్యంతో గురిచూసి బాల్ కొడితే బాస్కెట్‌లో పడాల్సిందే. రగ్బీ ఆటలో సైతం ముచ్చట గొలిపే పట్టు వారిది. ఇక ఖోఖోలో సైతం చిచ్చరపిడుగులే. ప్రతిభకు పేదరికం, సౌకర్యాల లేమి అడ్డురావని నిరూపిస్తున్నారు జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు. సామాన్య కుటుంబాల నుంచి ఎదుగుతున్న వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. తమ నైపుణ్యానికి పదునుపెడితే జాతీయస్థాయిలో కూడా సత్తా చాటుతామంటున్నారు. జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారుల అభిప్రాయాలతో సాక్షి కథనం...

రగ్బీ ఆటలో రాష్ట్రస్థాయికి...

ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన అండర్–14 క్రీడ పోటీల్లో జిల్లా కేంద్రంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎనిమిదో తరగతి చదువుతున్న సాయిచంద్, విగ్నేష్ అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు వాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు భూమన్న ప్రోత్సాహం, శిక్షణతో రగ్బీ ఆట లో సత్తా చాటుతున్నామని వారు పేర్కొంటున్నారు.



బాస్కెట్‌బాల్ ఆడుతున్న తిమ్మాపూర్ విద్యార్థులు

బాస్కెట్‌బాల్ పోటీల్లో తిమ్మాపూర్ విద్యార్థులు..

భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని నిషిత, ఏడవ తరగతి విద్యార్థి శశికాంత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నారు. వీరు ఇటీవల మంచిర్యాలలో జరిగిన జోనల్ స్థాయి అండర్- 14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇక్కడి వ్యాయామ ఉపాధ్యాయుడు డేవిడ్ బెనహర్‌తో పాటు ప్రధానోపాధ్యాయురాలు సరిత విద్యార్థులకు క్రీడలపై తగిన ప్రోత్సాహం అందిస్తున్నారు.

ఆష్టా బాలికలు రాష్ట్రస్థాయికి...

ముధోల్ మండలంలోని ఆష్టా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన తొమ్మిది మంది బాలికలు రాష్ట్రస్థాయి అండర్–18 ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇక్కడి ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ, గ్రామ వీడీసీ సభ్యులు విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహిస్తున్నారు.

టెన్నీకాయిట్‌లో సైతం..

సోన్ మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జోనల్‌స్థాయి టెన్నీకాయిట్ క్రీడల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

నిరంతర సాధనతోనే రాణింపు...



విద్యార్థులను ఉదయం, సాయంత్రం రెండు పూటలా రగ్బీ క్రీడలో సాధన చేయిస్తున్న దీని ద్వారానే తగిన శిక్షణ లభిస్తుంది. తద్వారా విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించేలా ప్రోత్సహిస్తున్నాం. దానికి అనుగుణంగా విద్యార్థులు కూడా అదే రీతిలో శ్రమిస్తున్నారు.

– వి.భూమన్న, ఫిజికల్ డైరెక్టర్, కస్బా ఉన్నత పాఠశాల, నిర్మల్

చదువుతోపాటు క్రీడలు అవసరమే...



చదువుతో పాటు క్రీడల్లో రాణించడం విద్యార్థులకు అవసరం. క్రీడలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అదే రీతిలో మా పాఠశాల విద్యార్థులను చదువుతోపాటు ఆటల్లోనూ నైపుణ్యం సాధించేలా చూస్తున్నాం. శారీరక మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయి.

– వాణి, ప్రధానోపాధ్యాయురాలు, కస్బా ఉన్నత పాఠశాల, నిర్మల్

కఠోర సాధనతోనే...



విద్యార్థుల కఠోర శ్రమతో సాధన చేయడంతోనే రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. తిమ్మాపూర్ పాఠశాలలో విద్యార్థులు బాస్కెట్‌బాల్ క్రీడలో నిరంతరం ఆసక్తి కనబర్చుతుండడంతో వారికి ఈ ఆటలో శిక్షణ ఇస్తున్నాను. దీంతో వారు కూడా బాస్కెట్‌బాల్ క్రీడలో మెలకువలను నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారు. మా ప్రధానోపాధ్యాయులు సరిత మేడమ్ కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

– డేవిడ్ బెన్హర్, పీఈటీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిమ్మాపూర్

సార్ల ప్రోత్సాహంతోనే...



మా ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఫిజికల్ డైరెక్టర్ భూమన్న సారు ప్రోత్సాహంతోనే రగ్బీ ఆటలో రాణిస్తున్నాం. బడిలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేస్తున్నాం. ఇందులో మెలకువలను నేర్పుతున్నారు. జోనల్‌స్థాయి లాగే రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటుతామనే నమ్మకం ఉంది.

– సాయిచంద్, 8వ తరగతి, కస్బా ఉన్నత పాఠశాల, నిర్మల్

అవకాశాలను అందిపుచ్చుకుని..



పాఠశాల స్థాయిలో ప్రతిరోజు శిక్షణతో రగ్బీ ఆటలో నైపుణ్యం సాధిస్తున్నాం. వ్యాయామ ఉపాధ్యాయులు ఈ ఆటలో రాణించేలా మెలకువలను నేర్పిస్తున్నారు. పాఠశాల, జోనల్ స్థాయిలో అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటున్నాం. ప్రతిభను గుర్తించడంతో మరింత ఉత్సాహం లభిస్తుంది.

– విఘ్నేష్, 8వ తరగతి, కస్బా ఉన్నత పాఠశాల, నిర్మల్

బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి...



బాస్కెట్‌బాల్‌ను ఎలా ఆడాలో మా పీఈటీ సార్ నేర్పించారు. ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉంటుందని మాసార్లు చెప్పారు. మైదానంలో బాస్కెట్‌బాల్ ఆడడంలోని మెలకువలు శిక్షణ ద్వారా నేర్చుకున్నాం. ప్రతీరోజు సాయంత్రం సాధన చేస్తుండడంతో ఆటలో పరిణతి సాధిస్తున్నాం. జోనల్ స్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాం.

– నిషిత, 9వ తరగతి, తిమ్మాపూర్

వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకెళ్లాలి



పరీక్షలు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వార్షిక ప్రత్యేక నమూనా పరీక్షలను పరిశీలించారు. ప్రతీరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సీ, డీ కేటగిరి విద్యార్థులకు ప్రత్యేక కార్యచరణ ద్వారా బోధన చేయాలన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలో ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

'నార్నూర్ సభకు అనుమతి ఇవ్వొద్దు'



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: నార్నూర్‌లో ఈ నెల 13న గిరిజనేతరులు తలపెట్టిన సభకు అనుమతి ఇవ్వొద్దంటూ ఆదివాసీ సంఘాల నాయకులు సోమవారం డీఎస్పీ నాగేందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అమలులో ఉన్న పెసా, భూబదలాయింపు చట్టాలు ఎవరి దయా దక్షిణ్యాలతో రాలేదని, ఆదివాసీ పోరాట యోధుల త్యాగాల వల్ల వచ్చాయన్నారు. ఈ చట్టాల జోలికి వస్తే మరో కొమురంభీం పోరాటం చేస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల ప్రతినిదులు ఉమేశ్, అర్క గంగారాం, ఆత్రం మారుతి, మెస్రం ఆనంద్ , ఆత్రం ప్రకాశ్, మడావి బాలాజీ, పెందూర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టించిన గ్రామస్తులు

- పరారీలో మరో ముగ్గురు
- రెండు బైక్‌లు స్వాధీనం

గుడిహత్నూర్: తెల్లవారు జామున ఓ పాన్‌షాప్‌లో చోరీకి పాల్పడుతున్న దొంగలను గుర్తించిన యజమాని, గ్రామస్తులు కలిసి వారిలో ఒక దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలోని తోషం గ్రామంలో చోటు చేసుకుంది. టాకీగూడకు చెందిన విజయ్ తోషం గ్రామ శివారులో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం దుకాణం మూసేసి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం తెల్లవారు జామున రెండు బైకులపై వచ్చిన ముగ్గురు దొంగలు దుకాణం తలుపులు పగులగొట్టేందుకు యత్నిస్తుండగా హైదరాబాద్ నుంచి టాకీగూడ వెళ్తున్న అదే గ్రామానికి చెందిన కారు డ్రైవర్ గణేశ్ గమనించి యజమాని దరాడే విజయ్‌కు సమాచారం అందించాడు. వెంటనే విజయ్ తన తమ్ముడు అజయ్‌ను వెంట తీసుకొని బైక్‌పై అక్కడికి చేరుకున్నాడు. వారిని చూసిన దొంగలు పారిపోయేందుకు యత్నించారు. వారిలో ఒకరిని పట్టుకోగా మిగతా ముగ్గురు పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించగా కానిస్టేబుల్ రాజన్న దొంగను అదుపులోకి తీసుకున్నారు. సదరు దొంగ పేరు సమీర్‌గా చెప్పినట్లు పోలీసులు తెలిపారు. వీరంతా జిల్లా కేంద్రంలోని చిలుకూరినగర్, వడ్డెర కాలనీకి చెందిన వారని, గతంలో మండలంలో జరిగిన కొన్ని దొంగతనాల్లో వీరి ప్రమేయం ఉందని ప్రాథమికంగా గుర్తించినట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు. మిగిలి వారిని సైతం త్వరలో పట్టుకుంటామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



పోలీసుల అదుపులో దొంగ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శివశంకర్ (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారి–363 శ్రీరాంపూర్ మందమర్రి బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. సోమవారం సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ ఏరియా భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓంద్ర శివశంకర్, సతీష్ ఆదివారం రాత్రి శ్రీరాంపూర్ నుంచి కారులో మందమర్రి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ మందమర్రి బైపాస్ జాతీయ రహదారిపై దొరగారిపల్లెకు సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. దీంతో కారు నడిపిస్తున్న సతీష్‌కు స్వల్ప గాయాలు కాగా ఓంద్ర శివశంకర్(32) అక్కడికక్కడే మృతిచెందాడు. శివకుమార్ కూలీ పని చేస్తుండేవాడు. అతడికి భార్య ఉంది. మృతుడి బంధువు గుమాస కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లికి చెందిన చెండే నవీన్‌పై బీరుసీసాతో దాడి చేసిన పల్లె పెద్దులు, సోమని గణేశ్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఎన్నికల ముందు పాతకక్షలతో బీరుసీసా పగులగొట్టి దాడి చేయడంతో నవీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. నార్నూర్ మండలం కొత్తపల్లికి చెందిన అమితాబాయి అటవీ హక్కు పత్రం మంజూరు చేయాలని, నాగల్కొండ గ్రామానికి చెందిన రాథోడ్ రాహుల్ ప్యాకింగ్ పరిశ్రమ కొరకు రుణం మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం టక్కుగూడకు చెందిన మెస్రం తిరుమల గురుకుల కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కోసం, ఇచ్చోడ మండలం మాన్కాపూర్‌కు చెందిన వెడ్మ రమ్య వైద్య చికిత్సకు ఆర్థికసాయం అందించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్రూం ఇండ్లు, స్వయం ఉపాధి, పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్సీవో గంగాధర్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

తెరుచుకోని పాఠశాల..

నర్సాపూర్(జి): మండలంలోని సాయినగర్ తండా, అంజనీతండా, దర్యాపూర్, అర్లి(కె) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, గొల్లమాడ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఏకోపాధ్యాయ (ఒక ఉపాధ్యాయుడు) పాఠశాలలుగా నడుస్తున్నాయి. సోమవారం సాయినగర్ తండా ఉపాధ్యాయుడు పాఠశాలకు సెలవు పెట్టడంతో గది తలుపులు తెరుచుకోలేదు. దీంతో ఇక్కడ చదువుతున్న 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినపుడు మరొకరికి బాధ్యతలు అప్పగించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సాయినగర్ తండాలో మూసి ఉన్న పాఠశాల

వైభవంగా సహస్ర దీపాలంకరణ



పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయంలో కార్తీక బహుళ చతుర్ధశిని పురస్కరించుకుని కార్తీకమాసం చివరి సోమవారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నిమ్మగడ్డ శరత్‌చంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

– ఖానాపూర్

వేతనాలు వస్తేనే విధులకు హాజరవుతాం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

తాంసి(బోథ్): తమకు వేతనాలు వస్తేనే విధులకు హాజరవుతామని భీంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వేతనాలు వచ్చే వరకూ విధులకు హాజరయ్యేది లేదన్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు ప్రేంసాగర్, స్వామి, అనుసూయ, రామేశ్వర్, గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య



వైష్ణవి మృతదేహం

లక్సెట్టిపేట: తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని మోదెలలో గాంధీనగర్‌కు చెందిన సావనపెల్లి సురేష్, తిరుమల దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. సురేష్ ఆటో నడుపుతుండగా తిరుమల ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తోంది. పెద్ద కుమార్తె వైష్ణవి(18) స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. చదువుపై ఇష్టంలేని వైష్ణవి కాలేజీకి వెళ్లనని చెప్పడంతో తల్లిదండ్రులు మందలించారు. సోమవారం ఉదయం తండ్రి ఆటోలో తీసుకెళ్లి కళాశాలలో దింపి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

శాస్త్రీయ విధానంలో బోధించాలి

- డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన

ముధోల్: విద్యార్థులకు శాస్త్రీయ విధానంలో పాఠాలు బోధించేలా చూడాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన సూచించారని ఎంఈవో మైసాజీ తెలిపారు. సోమవారం ఎంఈవోలతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో డైరెక్టర్ ఎస్‌ఈఆర్టీతో కలిసి మాట్లాడారు. ఎఫ్ఎల్ఎస్, ఉన్నతి, ల క్ష్యను పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రాథమిక దశ, ఉన్నత స్థాయిలోని విద్యార్థులకు విజ్ఞానశాస్త్ర పద్ధతిలో బోధించే సమయంలో అన్నిస్థాయిల్లో పరిశీలన చేసి తగు సలహాలు సూచనలు ఇవ్వాలని వివరించారు.



మీటింగ్‌లో పాల్గొన్న ఎంఈవో

బంగారు గొలుసు అపహరణ

కాగజ్‌నగర్‌టౌన్: వృద్ధురాలి మెడలోనుంచి బంగారు గొలుసు అపహరించిన సంఘటన పట్టణంలోని సర్‌సిల్క్ ఎఫ్‌కాలనీలో చోటు చేసుకుంది. బాధితురాలు శకుంతల తెలిపిన వివరాల ప్రకారం తుక్కు సామగ్రి కొనుగోలు చేసే వ్యక్తి వృద్ధురాలి ఇంటికి వచ్చాడు. సామగ్రి విక్రయిస్తుండగా ఇనుప రాడ్‌తో చంపుతానని బెదిరించాడు. దీంతో వృద్ధురాలు కేకలు వేయగా మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ బుద్దే స్వామి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.